సంక్షేమ పథకాలకు విశేష ఆదరణ



మాచవరంలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



ములికిపల్లిలో మహిళకు పథకాల లబ్ధి వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

- ఎమ్మెల్యేలు రాపాక, కొండేటి
- ములికిపల్లి, మాచవరంలో గడప గడపకూ

రాజోలు: రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు విశేష ఆదరణ లభిస్తుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం ములికిపల్లిలో ఎమ్మెల్యే రాపాక గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అందించిన వివిధ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి వివరించారు. రాబోయే కాలంలో సీఎం జగన్‌ను విజయపథంలో నిలిపి మళ్లీ సీఎంగా చూడాలన్నారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ ఏపీలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పలు రాష్ట్రాల్లో అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాయన్నారు. అమ్మఒడి పథకం, ఆరోగ్యశ్రీ, 108, 104 వాహనాలు, ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వంటి పథకాలు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచాయన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, మాజీ సర్పంచ్ తాడి సత్యనారాయణ, పరంశెట్టి ఏడుకొండలు, డి.సత్యప్రసాద్, మారుబోయిన మాస్, ముద్దాడ సీతామహాలక్ష్మి, దొమ్మేటి నాగేశ్వరరావు, వలవల వెంకటేశ్వరరావు, గుబ్బల త్రిమూర్తులు, చెల్లింగి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు

అంబాజీపేట: సుపరిపాలన అందిస్తూ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరం సచివాలయం-1లో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు ఇంటింటికీ వెళ్లి వ్యక్తిగతంగా ప్రతీ ఒక్కరితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని గణాంకాలతో సహా లబ్ధిదారులకు వివరించారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అందాలన్నా, పేదలకు మరింత మేలు చేకూరాలన్నా వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, దొమ్మేటి సత్యమోహన్, ఉందుర్తి నాగబాబు, ముత్తాబత్తుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. గడపగడపకు కార్యక్రమాన్ని నియోజకవర్గంలో ప్రారంభించి నేటికి 150 రోజులు పూర్తయిన సందర్భంగా అంబాజీపేట మార్కెట్ యార్డు ఎదుట భారీ కేకును కట్ చేసి అభిమానులకు పంచారు. కార్యక్రమంలో మైలా ఆనందరావు, మట్టపర్తి యజ్ఞశ్రీ వెంకటేశ్వరరావు, రాయుడు కృష్ణ మహేష్, గోసంగి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజలకు చేరవేసే బాధ్యత మీదే..



అంబాజీపేటలో గృహసారథులకు కిట్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించే బృహత్తర బాధ్యత మీ పైనే ఉందని, రాబోయే రోజుల్లో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డు ఆవరణలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు ఆధ్వర్యంలో జగనన్న సచివాలయ, గృహ సారథుల (జేసీఎస్) మండల ఇన్‌చార్జి దొమ్మేటి సత్యమోహన్ అధ్యక్షతన గ్రామ వలంటీర్లు, గృహ సారథుల సమావేశం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ మీకు తోడుగా గృహ సారథులను ఏర్పాటు చేశామని, రాబోయే రోజుల్లో కీలకమన్నారు. జగనన్న అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చెప్పాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు 87 శాతం మందికి పథకాలు అందించడం గొప్ప విషయమన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, జగనన్న విద్యా దీవెన, నాడు నేడులో పాఠశాలల ఆధునీకరణ, ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ లాంటి అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో బలంగా ప్రచారం చేయాలన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వలంటీర్లు, గృహ సారథుల విధి విధానాలను వివరించారు. అనంతరం గృహ సారథులకు కిట్‌లను పంపిణీ చేశారు. సమావేశంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, నాగవరపు నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు కొర్లపాటి కోటబాబు, వైస్ ఎంపీపీలు నేతల నాగరాజు, సూదాబత్తుల లక్ష్మీభార్గవి, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, కొండేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా విగ్రహ ప్రతిష్ఠలు



గ్రామంలో కొలువుదీరిన ధనమ్మ, వనువులమ్మ

మామిడికుదురు: మగటపల్లిలో నూతనంగా పునర్నిర్మించిన ఆలయాల్లో గ్రామదేవతలు ధనమ్మ, వనువులమ్మ వార్ల దివ్య విగ్రహ, శిఖర ప్రతిష్ఠ ఆదివారం ఉదయం 9.05 గంటలకు జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. ఈ ప్రతిష్ఠల్లో భాగంగా శుక్రవారం నుంచి పలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశన, క్షీరాధివాసం, మంత్ర జపం, మహిళలతో కుంకుమ పూజ, మండప పూజ, మూలమంత్ర హోమాలు, రుద్రహోమం, శ్రీమహాలక్ష్మి హోమం, యాగశాల అర్చన, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, పంచశయ్యాధివాసం, బలిహరణ, మండప పూలు, నీరాజన మంత్ర పుష్పం, చదుర్వేద స్వస్తి, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వేద మంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ ఈ కార్యక్రమాలు ఆద్యంతం కనులపండువలా జరిగాయి. పలువురు భక్తులు ఈ పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు.

నేడు వీరభద్రుని విగ్రహ ప్రతిష్ఠ

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం శివారు అరిగెలవారి పాలెంలో వీరభద్రస్వామి వారి ఆలయ విగ్రహ, శిఖర ప్రతిష్ఠలను ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దీనిలో భాగంగా శనివారం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యం, మండపారాధన, దీక్షాధారణ, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన హోమాలు, యంత్రాలకు శిఖరానికి క్షీరాభిషేకం, ధాన్యాధి, పుష్ప ఫలాదిరసాలు జరిపించారు. ఈనెల 6న స్వామి అన్న సమారాధన చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బీచ్ వద్ద ఏర్పాట్ల పరిశీలన



అంతర్వేది బీచ్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు పరిశీలిస్తున్న డీఎస్పీ రమణ

సఖినేటిపల్లి: అంతర్వేది తీర్థమహోత్సవాల్లో తొమ్మిదో రోజు ఆదివారం మాఘపౌర్ణమి సందర్భంగా బీచ్ వద్ద సముద్రంలో స్వామిని స్నానం చేయించే సమయంలో తీసుకోవాల్సిన భద్రతాపరమైన ఏర్పాట్లను, భక్తులకు సంబంధించి ఇతర ఏర్పాట్లను వేర్వేరుగా రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు శనివారం పరిశీలించారు. అమలాపురం ఆర్డీవో వసంతరాయుడు, కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణతో కలసి పరిశీలించారు. ఒడ్డున స్వామికి నిర్వహించే విశేషపూజలు, స్వామిని సముద్రంలో తీసుకువెళ్లే క్రమంలో తగిన భద్రత గురించి ఆర్డీవో సమీక్షించారు. అలాగే సముద్రంలో స్నానం చేసే సమయంలో తొక్కిసలాట లేకుండా తీసుకోవాల్సిన చర్యలను డీఎస్పీ రమణ, ఎస్సై అడపా ఫణిమోహన్‌కు సూచించారు. వీటితో పాటు భక్తులు లోతు జలాల్లోకి వెళ్లకుండా సముద్రంలో ఏర్పాటు చేసిన సర్వేబాదుల బారికేట్స్, స్వామిని తీసుకువెళ్లే మార్గాన్ని డీఎస్పీ పరిశీలించారు.

స్వామి సన్నిధిలో జలవనరుల ఈఎన్‌సీ



అంతర్వేది ఆలయంలో నారాయణరెడ్డి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం రాష్ట్ర జలవనరుల శాఖ ఈఎన్‌సీ ఎల్.నారాయణరెడ్డి, కుటుంబ సభ్యులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. వెంట ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాల రాజా బహద్దూర్, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మాజీ దేవస్థానం చైర్మన్ అల్లూరి మాధవవర్మ పాల్గొన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన కొత్తపేట మండలం మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) క్షేత్రానికి శనివారం ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. వివిధ రూపాల్లో టికెట్ల ద్వారా రూ.1,82,202 ఆదాయం, అన్న ప్రసాదం విరాళం రూపంలో రూ.28,553 వచ్చినట్టు ఈఓ సింగం రాధ తెలిపారు.

శనైశ్చరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు →



క్లుప్తంగా

హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



దివ్యాంగుల సదస్సులో మాట్లాడుతున్న సర్పంచ్ రమేష్‌బాబు

మలికిపురం: దివ్యాంగుల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని చింతలమోరి సర్పంచ్ డాక్టర్ రాపాక రమేష్‌బాబు పేర్కొన్నారు. శనివారం గ్రామంలో దివ్యాంగుల సదస్సు జరిగింది. రమేష్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దివ్యాంగులపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని కోరారు. ప్రభుత్వాలు వారికి రక్షణగా ఉండాలన్నారు. ముత్యాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాల గంగాధరరావు, ఎంపీటీసీ తోటి రాజేష్ చెవ్వాకుల కృష్ణారావు, పితాని ఏసుబాబు, ఆచంట బేబీ, చెవ్వాకుల తాతారావు, బొమ్మిడి నరసింహారావు, సరెళ్ళ జ్యోతి, భయ్యా వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'తమ్మన'కు ఘన సత్కారం

ఆలమూరు: ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత, మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసుకు శనివారం ఘన సత్కారం జరిగింది. చెముడులంకలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మంటపంలో పంచాయతీ కార్యదర్శి యు.రేణుక ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు సంయుక్తంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి మెమెంటోను బహూకరించి సన్మానం చేశారు. గ్రామ పంచాయతీ ఏర్పడి మూడున్నర దశాబ్దాల తరువాత ఉత్తమ పనితీరుతో అవార్డు సాధించిన సర్పంచ్ తమ్మనను పలువురు వక్తలు కొనియాడారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామిఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

విద్యుత్ ఉద్యోగులకు సన్మానం



విద్యుత్ అధికారులను సత్కరించిన ఉద్యోగులు

ఆలమూరు: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రామచంద్రపురం డివిజన్ పరిధిలో ఉత్తమ అవార్డులు సాధించిన ముగ్గురు అధికారులకు శనివారం ఘన సత్కారం జరిగింది. ఆలమూరు సబ్‌స్టేషన్ వద్ద ఉత్తమ అవార్డులు పొందిన మండపేట ఏడీఈ జి.తిరుమలరావు, ఇన్‌చార్జి జేఈ వై.లక్ష్మి, లైన్‌మన్ అడబాల శ్రీరామకృష్ణలకు అభినందన సభ జరిగింది. విద్యుత్ ఉద్యోగులు అవార్డు గ్రహీతలకు పూలమాలలు, దుశ్శాలువ వేసి మెమెంటోలను బహూకరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనతికాలంలోనే విద్యుత్ సమస్యలు లేని సబ్‌స్టేషన్‌గా తీర్చిదిద్దిన ఇన్‌చార్జి జేఈ లక్ష్మిని పలువురు అభినందించారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

అంబాజీపేట: ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి గెలుపు ఓటములు సమానంగా స్వీకరిస్తారో వారికి విజయాలు వరిస్తాయని అంబాజీపేట ఎస్సై ఎ.చైతన్యకుమార్, పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు, ఆర్‌ఎంసీ చర్చి ఫాదర్ వినయ్ అన్నారు. ఇరుసుమండ సెయింట్ జోసఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ ప్రధానోపాధ్యాయిని సిస్టర్ సునీమోల్ ఎస్.జె అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు 200, 800 మీటర్లు, షాట్‌పుట్, లాంగ్‌జంప్, డిస్కస్‌త్రో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ రెనీ, సిస్టర్ జూలియట్, సిస్టర్ అన్నీ అబ్రహం, బెస్సా, చిన్నం బాలవిజయరావు, ఎ.భీమశంకరం, జె.శాంతిరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవానికి ఏర్పాట్లు

సఖినేటిపల్లి: అంతర్వేది తీర్థమహోత్సవాల్లో పదోరోజు సోమవారం అంతర్వేది చెరువులో దేవస్థానం ఆధ్వర్యాన నిర్వహించే స్వామి, అమ్మవార్ల తెప్పోత్సానికి ఏర్పాట్లు శనివారం ప్రారంభించారు. ఇందుకు అవసరమయ్యే రెండు ఫైబర్ వేట బోట్లను పల్లిపాలెం హార్బర్ వద్ద నుంచి ఓఎన్జీసీ భారీ ట్రాలీపై తీసుకువచ్చి చెరువులోకి చేర్చారు. అంతకుముందు హార్బర్ వద్ద బోట్లను క్రేన్ సాయంతో ట్రాలీపైకి చేర్చారు. చెరువులో బోట్లను కలుపుతూ చెక్కలతో అరప సిద్ధం చేసే పనులు చేట్టారు. అనంతరం హంస వాహనాన్ని రెండు బోట్లు కలిపిన అరపై ఏర్పాటు చేసి, విద్యుత్ దీపాలంకరణ, పుష్పాలంకరణ చేసి, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతారు. స్వామిని పుష్పకవాహనంపై గ్రామోత్సవం అనంతరం తెప్పపై అర్చకులు కొలువుదీరుస్తారు.

క్షతగాత్రుడికి రూ.30 వేల ఆర్థిక సాయం

ఆలమూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద కోలుకుంటున్న క్షతగాత్రుడు గంధం వెంకన్నకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి రూ.30 వేలు ఆర్థికసాయం అందించారు. మండలంలోని పెనికేరులోని అతని నివాసానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలను, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలా అండగా ఉంటానని, ప్రభుత్వం నుంచి సాయం అందించేందుకు ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు సమకూర్చిన రూ.పది వేలను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. సర్పంచ్ వనుం చిన్నావతి, ఎంపీటీసీ యనమదల స్వాతి, పీఏసీఎస్ అధ్యక్షులు జుత్తుక శ్రీనివాసు పాల్గొన్నారు.

పంటకాలువలో మృతదేహం

మలికిపురం: స్థానిక గుడిమెళ్లంక వంతెన వద్ద పంట కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్సై హరికోటి శాస్త్రి శనివారం తెలిపారు. మద్యం దుకాణం ఎదురుగా ఈ మృతదేహం కాలువలో ఉండడంతో మద్యం మత్తులో పడి పోయి ఉంటాయని భావిస్తున్నారు. ఫ్యాంటు, చొక్కా వేసుకున్న ఇతని మెడలో జంధ్యం ఉందని, వయస్సు 40 సంవత్సరాలు పైబడి ఉంటాయని ఆయన అన్నారు. మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించామని, గల్లంతైన వ్యక్తుల బంధువులు ఉంటే గుర్తించేందుకు రావాలని ఆయన కోరారు.

ధర్మకర్తల మండలికి ఏర్పాటుకు నోటిఫికేషన్

కొత్తపేట: మండలంలోని పలివెల ఉమా కొప్పేశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి ఏర్పాటు నిమిత్తం దేవదాయ-ధర్మదాయ శాఖ కాకినాడ ఉప కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు దేవస్థానం ఈఓ ఎస్‌వీఎస్ఎస్‌వీ ప్రసాదరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 3 నుంచి 20 రోజుల్లోగా ఎండోమెంట్ యాక్ట్ 30/87 ప్రకారం తగు అర్హత గలవారు ధర్మకర్తలుగా ఉండు నిమిత్తం దరఖాస్తు చేసుకోవలసిందిగా కోరారు.

రావిపాడు చెరువు నవీకరణ పనులు ప్రారంభం

పి.గన్నవరం: జల సంరక్షణకు, మంచినీటి చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పి.గన్నవరం శివారు రావిపాడులో ఎన్‌ఆర్‌ఈజీఎస్ అమృత్ సరోవర్ పథకంలో భాగంగా రూ.9.98 లక్షలతో మంచినీటి చెరువు పూడికతీత పనులను శనివారం చిట్టిబాబు ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ బి.చంద్రమోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర రావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారు నాయుడు, స్థానిక సర్పంచ్ బొండాడ నాగమణి, ఎంపీటీసీలు దాసరి మౌనిక, పులపర్తి చినవెంకటలక్ష్మి, ఏపీడీ ఎండీ నాగప్రసాద్, ఈసీ విజయారెడ్డి, ఎం.త్రినాథ్, నాయకులు దాసరి కాశీ, అంబటి కోటేశ్వరరావు, నాగాబత్తుల యువరాజు, కర్రి బాబూరావు, పంచాయతీ ఈఓ కె.పోలరాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల గ్రామ సచివాలయాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది శనివారం చిన్నారులకు టీకాలు అందజేశారు. వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలానాయుడు ఆధ్వర్యాన ఆలమూరు-2, కలవచర్ల, పినపళ్ల, సంధిపూడి, జొన్నాడ శివారు మూలాటిరేవు, చొప్పెల్ల, మోదుకూరు, నవాబుపేట, మడికి శివారు మల్లవానితోట, మూలస్థాన అగ్రహారం తదితర గ్రామాల్లో అనేక మంది చిన్నారులకు ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది టీకాలు వేశారు. ఈ టీకాల ప్రక్రియను సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి పర్యవేక్షించారు.

ఓఎన్జీసీ నిధులతో సామాజిక సేవా కార్యక్రమాలు



ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఓఎన్జీసీ ఈడీ అమిత్‌నారాయణ

మామిడికుదురు: ఓఎన్జీసీ నిధులు రూ.నాలుగు కోట్లతో ఈ ఏడాది పలు సామాజిక సేవలు నిర్వహించామని ఆ సంస్థ ఈడీ, రాజమహేంద్రవరం అసెట్ మేనేజర్ అమిత్ నారాయణ తెలిపారు. ఓఎన్జీసీ ఆధ్వర్యంలో పాశర్లపూడి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన ఉచిత ఫీల్డ్ ఓపీడీ క్లినిక్‌ను శనివారం ఈడీ ప్రారంభించారు. సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి అధ్యక్షతన జరిగిన సభలో ఈడీ మాట్లాడారు. ప్రతి నెలా మొదటి, మూడో శుక్రవారం పాశర్లపూడి గ్రామ పంచాయతీలో రాజమహేంద్రవరం అసెట్ ఆధ్వర్యంలో ఫీల్డ్ ఓపీడీ క్లినిక్ ఏర్పాటు చేసి పేదలకు నిపుణులైన వైద్యుల ఆధ్వర్యంలో అన్ని అనారోగ్య సమస్యలకు ఉచిత చికిత్సతో పాటు ఉచిత శారీరక వైద్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఉచితంగా మందులు కూడా అందజేస్తారన్నారు. సామాజిక సేవల్లో భాగంగా విద్య, వైద్యం, రహదారుల అభివృద్ధితో పాటు తాగునీటికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఈడీ నారాయణ చెప్పారు. పూర్వపు ఉభయగోదావరి జిల్లాలతో పాటు కృష్ణా జిల్లాలో కూడా ఓఎన్జీసీ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అంతర్వేది, పాశర్లపూడి, కేశవదాసుపాలెం గ్రామాల్లో నెలకు రెండు ఫీల్డ్ ఓపీడీ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గోదావరి వరదలు, భారీ వర్షాల వల్ల ఉపాధి కోల్పోయిన 50 వేల మందికి సహాయం అందించామన్నారు. కార్యక్రమంలో సర్ఫేస్ మేనేజర్ డీఏ సుబ్బరాజు, హెచ్‌ఆర్ నావేద్‌రావు, మెడికల్ ఇన్‌చార్జ్ డీవీ అహ్మద్, హెచ్‌ఆర్ ఇన్‌చార్జ్ వెస్లీ, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, పంచాయతీ కార్యదర్శి పీవీఆర్‌కే రాజు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ తోరం సతీష్

మలికిపురం: కేన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ముఖ్యమని మలికిపురం ఎంవీఎన్ జేఎస్అండ్ఆర్వీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ మంగెన వెంకట సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం నేపథ్యంలో కళాశాలలో శనివారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సదస్సులో రాజమహేంద్రవరం కార్పొరేషన్ మెడికల్ ఆఫీసర్ దాసరి శ్రీనివాస్ ఆన్‌లైన్లో విద్యార్థులతో మాట్లాడారు. వ్యాధులపై అవగాహన కల్పించారు. చక్కని ఆరోగ్య అలవాట్లతో వ్యాధులను దూరం చేయవచ్చని అన్నారు. ప్రిన్సిపాల్ తోరం సతీష్, అధ్యాపకులు ఆచంట శివాజీ, నిశ్చలాదేవి, ప్రశాంతి, స్రవంతి, అభిషేక్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం



జానకీయమ్మ సత్రం నూతన పాలకమండలి సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: పొడగట్లపల్లి ఉప్పలపాటి జానకీయమ్మ అన్నదాన సత్రం నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకారం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు. నూతనంగా నియమితులైన సత్రం చైర్మన్ కొపెల్ల మల్లికార్జునరావు, పాలకమండలి సభ్యులు చిక్కల గంగాజలం, చెల్లుబోయిన కాశీజగన్నాథం, కలిదిండి శ్రీనురాజు, పమ్మి మాణిక్యం, కొల్లి ధనలక్ష్మి, మాగపులక్ష్మిలతో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తదితరులు నూతన పాలకమండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

80 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ

గ్రామంలోని 80 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ గతంలో 310 మందికి గ్రామంలో ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయని 230 మందికి గతంలో పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారికి ఈరోజు అందజేశామన్నారు.

వలంటీర్లు, గృహసారథులు.. సంక్షేమ వారధులు



కొత్తపేట సదస్సులో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: వలంటీర్లు, గృహ సారథులు ప్రభుత్వానికి-ప్రజల సంక్షేమానికి వారధులని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కొత్తపేట మండలంలో వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ ఇన్‌చార్జ్‌ల శిక్షణ సదస్సులు నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం కొత్తపేట, మందపల్లి, పలివెల, గంటి, ఖండ్రిగ, అవిడి, మోడేకుర్రు గ్రామాలకు సంబంధించి స్థానిక శ్రీఖరి శుభకరి కల్యాణ మండపంలో, సాయంత్రం వాడపాలెం, వానపల్లి, బిళ్లకుర్రు గ్రామాలకు సంబంధించి వానపల్లి సొసైటీలో నిర్వహించారు. ఎంపీపీ, మండల జేసీఎస్ కన్వీనర్ మార్గన గంగాధరరావు అధ్యక్షతన జరిగిన సదస్సుల్లో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పరిపాలనను ప్రజలకు చేరువచేసేందుకు సచివాలయ వ్యవస్థ ఒకటైతే దానికి వలంటీర్ వ్యవస్థతో జీవం పోశారన్నారు. ప్రజావసరాలు తీర్చేందుకు, వారి బాగోగులు చూసేందుకు వలంటీర్లకు గౌరవం ఇచ్చి, గౌరవభృతి కల్పించారన్నారు. వారికి తోడ్పాటుగా నేడు గృహసారథులను నియమించారన్నారు. వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావడానికి శక్తి వంచన లేకుండా కృషి చేసిన వారిని సచివాలయ ఇన్‌చార్జ్‌లుగా, గృహ సారథులగా నియమించామన్నారు. రాబోయే రోజుల్లో గృహసారథుల పాత్ర కీలకమైందన్నారు. ఈ సదస్సుల్లో రాష్ట్ర పార్టీ నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, వైస్ ఎంపీపీ దంగేటి వెంకటనాగమణి, డీసీసీబీ పర్సన్ బండారు రాజా, పీఏసీఎస్ పర్సన్ ఇన్చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, మండల యువజన విభాగం కన్వీనర్ గొల్లపల్లి స్వరూప్, సర్పంచ్‌లు రెడ్డి చంటి, సాగి బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించాలని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, ఈఓపీఆర్డీ రాజ్‌కుమార్ అన్నారు. ఆలమూరు ఎంపీపీ కార్యాలయంలో శనివారం గ్రామ సచివాలయ ఉద్యోగులతో మండల అభివృద్ధి, పథకాలు-అమలుపై సమీక్ష జరిగింది. ప్రభుత్వ పథకాలు అమలు- గ్రామ సచివాలయ ఉద్యోగుల పాత్రను వివరిస్తూ ఎంపీడీఓ జాన్‌లింకన్ ప్రసంగించారు. ఇటీవల ప్రభుత్వం అందించిన చేదోడు, ఆసరా పథకాలను లబ్ధిదారులకు అందించిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో శాఖల వారీగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలను అందించాలన్నారు. సూపరింటెండెంట్ వి.రామస్వరూప్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

